సాక్షి నిజామాబాద్

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



మమ్మల్ని పట్టించుకోండి..

సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ లేదా పేస్కేల్ పెంచి ఆదుకోవాలని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

- 8లో



అరుణాచలంకు ప్రత్యేకబస్సు

భక్తుల సౌకర్యార్థం అరుణాచలం పుణ్య క్షేత్రానికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి తెలిపారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
27.8 /21.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురుస్తాయి. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మాజీ సైనిక కుటుంబాలకు అవగాహన సదస్సు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని మాజీ సైనికులకు, మాజీ సైనిక వితంతువులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఈనెల 20న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సైనిక్ భవన్ ఆదర్శ్ నగర్ దుబ్బాలో ఉదయం 10 గంటలకు సదస్సు ఉంటుందన్నారు. సదస్సులో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రీయ సైనిక బోర్డు ఇచ్చే రాయితీలు, సదుపాయాల గురించి వివరించనున్నట్లు తెలిపారు. అలాగే మాజీ సైనికుల పిల్లలకు ప్రైమ్ మినిష్టర్ స్కాలర్షిప్ / కేంద్రీయ సైనిక్ బోర్డు స్కాలర్షిప్, అర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ ద్వారా విద్య రాయితీ, హాస్టల్ వసతి గ్రాంట్‌లకు ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించనున్నారు. మాజీ సైనికుల కుటుంబాలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

కృషితోనే అద్భుత విజయాలు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



ఆర్మూర్ టౌన్: పట్టుదలతో కృషిచేస్తే ఎన్నో అద్భుత విజయాలు వరిస్తాయని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి పార్థసారథి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం చిట్ల ప్రమీల జీవన్ రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'విద్యాస్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించారు. పార్థసారథి తన తల్లిదండ్రుల పేరిట నెలకొల్పిన ట్రస్టు ఆధ్వర్యంలో అవార్డులు బంగారు, వెండి పతకాలను బహూకరించి, చిన్నారులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ. ప్రతి ఒక్కరి జీవితంలో విద్య ఎంతో ప్రాముఖ్యమైనదని, విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులు కూడా ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్, ఆర్డీవో వినోద్‌కుమార్, ఎంఈవో రాజ గంగారాం, ట్రస్టు కన్వీనర్ నర్సింలు, పాఠశాల హెచ్‌ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ కల్చరల్ రేడియేషన్ ఫెస్టివల్ కాంపిటీషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 'కేసీఆర్ ఉండగా ప్రతిరోజు పండగ కార్యక్రమం సెప్టెంబర్ 4న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరుగుతుందన్నారు. ఈ రాష్ట్రస్థాయి కాంపిటీషన్ పోటీలకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆసక్తి కలిగిన అంశాలలో తమ ప్రదర్శనను ఇవ్వడం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 23న తమ పాఠశాల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న టీమ్‌ల నుంచి ఉన్నతమైన రెండు లేదా మూడు టీమ్‌లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ఒక టీమ్ నందు పది నుంచి 20 మంది విద్యార్థులు ఉండవచ్చన్నారు. నాగరాజ్ (9848158850),గోపాలకృష్ణ (949158 81 25), గంగా కిషన్ (9848219365) నంబర్లకు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఈవో సూచించారు.

ఎస్సారెస్పీలోకి వరద

బాల్కొండ : స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వలన శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు పెరిగింది. శనివారం ఉదయం 15 వేల క్యూసెక్కులు వచ్చిన వరద నీరు మధ్యాహ్నానికి 30 వేల క్యూసెక్కులకు పెరిగింది. ఆ తర్వాత 50,925 క్యూసెక్కులు పెరిగి నిలకడగా రాత్రి వరకు కొనసాగింది. ఈ ఏడాది తొలిసారిగా ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 86 టీఎంసీలు దాటింది. ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతోంది. రాత్రి వరకు ప్రాజెక్టులో 87 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతున్నందున ఏ క్షణమైనా ప్రాజెక్ట్ వరద గేట్లు ఎత్తే అవకాశం ఉందని, దిగువ గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ సూచించారు. పశువుల కాపరులు పశువులను మేపేందుకు, మత్స్యకారులు చేపల వేటకు నది ప్రవాహం వైపు వెళ్లవద్దన్నారు.

టిక్కెట్ల ఉత్కంఠ

- 21న బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన వార్తల నేపథ్యంలో చర్చ
- 'హ్యాట్రిక్' సాధన కోసం పకడ్బందీగా అధికార పార్టీ
- భరోసాతో ఉన్న నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- ఆర్మూర్ నియోజకవర్గం విషయంలో స్పష్టత కరువు
- ఇంటెలిజెన్స్ నివేదికలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వ్యతిరేకతే కారణం.. ?



బీఆర్ఎస్ అభ్యర్థులను పార్టీ అధినేత సోమవారం ప్రకటించనున్నారని వార్తలు వెలువడిన నేపథ్యంలో జిల్లాలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆర్మూర్ మినహా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సిట్టింగ్ అభ్యర్థులకే పార్టీ టిక్కెట్ల స్పష్టత ఇప్పటికే వచ్చింది. జీవన్ రెడ్డిపై పార్టీ శ్రేణుల వ్యతిరేకతతో పాటు ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక మేరకు మార్పు చేయనున్నట్లు తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నోటిఫికేషన్ రాకముందే శాసనసభ ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీలు ప్రచార పర్వానికి నగారా మోగిస్తున్నాయి. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు అధికార పార్టీ బీఆర్ఎస్, అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సత్తా చాటేందుకు బీజేపీలు క్షేత్రస్థాయిలో తిరుగుతూనే కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నాయి. సకల అస్త్రాలు అమ్ముల పొదిలో సమకూర్చుకుంటున్నాయి. మరోవైపు ఉత్తర తెలంగాణలో కీలకమైన నిజామాబాద్ జిల్లాలో పట్టు నిరూపించుకునేందుకు ఎంఐఎం సైతం తన వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇక కీలకమైన టిక్కెట్ల కేటాయింపు విషయంలో సాధ్యమైనంత ముందుగా ప్రకటించేందుకు పార్టీలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థులను ఈ నెల 21న ఏకంగా 86 మందిని మొదటి జాబితాలో అధినేత కేసీఆర్ ప్రకటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో సిట్టింగులందరూ బీఆర్ఎస్ తరుపున వరుసగా రెండుసార్లు గెలిచారు. సిట్టింగులకే సీట్లని అధినేత భరోసా ఇచ్చినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 15 శాతం మంది సిట్టింగులను మార్చనున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, బోధన్ సిట్టింగులకు టిక్కెట్లు ఖాయంగా తెలుస్తోంది.

ఆర్మూర్ నియోజకవర్గం..

కేటీఆర్, కవిత జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల సిట్టింగులను భారీ ఆధిక్యతతో గెలిపించాలని ఇప్పటికే పిలుపునిచ్చారు. ఒక్క ఆర్మూర్ విషయంలో మాత్రం ప్రకటన చేయకపోగా, స్పష్టత అనేది లేకుండా పోయింది.

ఆర్మూర్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై ఇంటెలిజెన్స్ నివేదికలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వ్యతిరేకత నేపథ్యంలో మార్పు చేయనున్నట్లు ప్రగతిభవన్ వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వంపై సానుకూలత ఉన్నా..

ప్రభుత్వ పథకాల విషయంలో ప్రజల్లో సానుకూలత ఉన్నప్పటికీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పట్ల అత్యధిక మంది కార్యకర్తల్లో, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. ఇప్పటికే పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కొందరు ప్రభుత్వ అధికారులు తమను బూతులు, అసభ్య పదజాలంతో జీవన్‌రెడ్డి తిట్టిన ఆడియో రికార్డులను ఇంటెలిజెన్స్ ద్వారా అధిష్టానానికి పంపారు. మరోవైపు కల్లెడ సర్పంచ్ లావణ్య, ప్రసాద్‌గౌడ్ దంపతుల విషయంలో ఎమ్మెల్యే వ్యవహరించిన విధానం, నందిపేట సర్పంచ్ సాంబారు వాణి తిరుపతి దంపతుల ఆత్మహత్యాయత్నం విషయంలోనూ జీవన్‌రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. పలువురు సర్పంచ్‌లు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. పార్టీ పట్ల విధేయతతో ఉన్నప్పటికీ జీవన్‌రెడ్డి అభ్యర్థిత్వం విషయంలో మాత్రం తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీలు సైతం గట్టి ప్రత్యర్థులను ఇక్కడ బరిలో దించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. దీంతో ఈ టిక్కెట్టు విషయమై అధినేత కేసీఆర్ పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్మూర్ సీటు విషయమై జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల్లో చర్చ సాగుతోంది.

రేసులో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ఉద్యమంలో జిల్లాలో కీలక పాత్ర పోషించిన జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆర్మూర్ టిక్కెట్టు రేసులో ఉన్నారు. తనకు టిక్కెట్టు ఇవ్వకపోతే తన కుమారుడు సందీప్‌రావుకు అయినా టిక్కెట్టు ఇవ్వాలని విఠల్‌రావు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు నియోజకవర్గంలో కీలకమైన మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని సైతం అధినేత కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

వర్షంలోనూ ఉత్సాహంగా 5కె రన్

- 'ఐ ఓట్ ఫర్ షూర్' నినాదంతో ముందుకు సాగిన పరుగు

సుభాష్‌నగర్ : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం 'ఐ ఓట్ ఫర్ షూర్' నినాదంతో నిర్వహించిన 5కె రన్ ఉత్సాహంగా సాగింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా ప్రతిచోట పెద్ద సంఖ్యలో వివిధ వర్గాల వారు 5కె రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటారు. బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో 5కె రన్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతోపాటు ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, యువతీయువకులు పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు 5కె రన్ విజయవంతానికి ముందస్తుగానే విస్తృతస్థాయిలో చేపట్టిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. నియోజకవర్గాల వారీగా ఎన్నికల విభాగం అధికారులతోపాటు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి 5కె రన్ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఆయా నియోజకవర్గాల్లో అధికారులు అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ 5కె రన్ విజయవంతం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటు వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



నగరంలో 5కె రన్‌లో అధికారులు, విద్యార్థులు

పంటలకు ప్రాణం పోసిన వాన



పచ్చదనం సంతరించుకున్న సోయాపంట



ముప్కాల్‌లో నీట మునిగిన పంట పొలాలు



పెద్ద వాగు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

- జిల్లాలో ఎడతెరపి లేకుండా..
- 58.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- మరో రెండ్రోజులు కురిసే అవకాశం

సుభాష్ నగర్ / బాల్కొండ: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల్లో 58.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వాన సోయా, మొక్కజొన్న, పసుపు, వరి పంటలకు ప్రాణం పోసినట్లయింది. జిల్లాలో 20 రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. గత నెలలో పక్షం రోజులు నిరంతరం వర్షాలు కురిసాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. ఈ నీటితో రైతులు పంటలకు నీరు అందించేందుకు రాత్రి, పగలు పంట చేన్ల వద్దనే పడిగాపులు కాశారు. ఒక దశలో బోర్లు ఎత్తిపోయే పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం కురుస్తున్న వానతో రైతులు సంబుర పడుతున్నారు. సోయా వర్షం కురిస్తేనే మంచి దిగుబడి వస్తుందని, వరికి తెగుళ్లు, మక్క పంటకు పట్టిన కత్తెర గత్తర దూరమవుతుందని చెబుతున్నారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో శనివారం రోజంతా ఆకాశం మేఘావృతమైంది. జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ సీజన్‌లో జూలై నెలలో సాధారణం కంటే అత్యధికంగా వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 28 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 5 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

స్థానికులను, పాత ఇళ్లలో ఉండే వారిని అధికారులు అప్రమత్తం చేశారు. వర్షపు నీటితో పంట పొలాలు నీట మునిగాయి. రాగల రెండ్రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలు.. (మిల్లీమీటర్లలో..)

మండలాలు	వర్షపాతం								
భీమ్‌గల్	107.4	డిచ్‌పల్లి	86.3	డొంకేశ్వర్	61.4	సిరికొండ	46.5	రుద్రూరు	39.0
కమ్మర్‌పల్లి	100.3	ముప్కాల్	78.8	మాక్లూర్	51.3	నిజామాబాద్‌రూరల్	46.5	ఇందల్వాయి	35.0
ఏర్గట్ల	96.5	బాల్కొండ	70.8	బోధన్	50.3	ధర్పల్లి	43.5	పోతంగల్	34.0
మోర్తాడ్	92.0	ఆలూరు	70.5	సాలూర	49.8	నిజామాబాద్‌సౌత్	41.3	వర్ని	29.0
వేల్పూర్	87.8	రెంజల్	66.5	మోస్రా	48.5	చందూరు	41.0	మోపాల్	50.8
మెండోరా	86.5	ఆర్మూర్	65.8	ఎడపల్లి	48.0	జక్రాన్‌పల్లి	40.3		
		నవీపేట	61.5	నిజామాబాద్‌నార్త్	47.3	కోటగిరి	40.0		

రూ. కోట్ల విలువ చేసే వాన..



రెండ్రోజులుగా పడుతున్న వాన రూ. కోట్ల విలువ చేస్తుంది. ఆరు తడి పంటలకు ప్రాణం పోయడమే కాకుండా రోగాలను దూరం చేస్తుంది. వరి పంటకు మేలు జరుగుతుంది. అనందంగా ఉంది.

– గాండ్ల పేట రమేశ్, రైతు

రాజసం ఉట్టిపడేలా..

సండే స్పెషల్

కట్టిపడేసే ఆకృతి.. ఉట్టిపడే రాజసంతో 'థార్' వెహికిల్ ఆకట్టుకుంటోంది. ఇది మధ్యతరగతి నుంచి సంపన్న వర్గాల వరకు అందరి మనసూ దోచుకుంటోంది. 'థార్'పై సవారీకి చాలామంది ఆసక్తి చూపుతుండడంతో జిల్లాలోనూ ఈ వాహనాల సంఖ్య పెరుగుతోంది. జిల్లా రోడ్లపై రయ్యిరయ్యిమంటూ దూసుకుపోతున్న 'థార్'పై సండే స్పెషల్..



- 'థార్'పై సవారీకి పెరుగుతున్న క్రేజ్
- నాయకుల కాన్వాయ్‌లోనూ ఈ వాహనాల జోరు
- ధర ఎక్కువైనా కొనుగోలుకు ఆసక్తి

సాక్షి, కామారెడ్డి: కరోనా వ్యాప్తి తర్వాత చాలామంది కార్ల కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లా రోడ్లపై కార్ల సంఖ్య పెరిగిపోయింది. చాలా మందిలో ఆర్థిక శక్తి కూడా పెరగడంతో లగ్జరీ కార్ల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. మహీంద్ర కంపెనీ తయారు చేసిన 'థార్' మోడల్‌కు చాలా మంది ఫిదా అవుతున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు తమ కాన్వాయ్‌లో థార్‌లు ఉంచుకుంటున్నారు. వ్యాపారులూ ఈ వాహనంపై మనసు పారేసుకుంటున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో రాణించిన వాళ్లు హుందాతనం కోసం థార్ మీద సవారీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కొందరైతే రెండు, మూ డు వాహనాలు కొనుగోలు చేశారు. దీంతో 'థార్' వాహనాలు జిల్లా రోడ్లపై రయ్యిమంటూ పరుగులు తీస్తున్నాయి.

లాంగ్ డ్రైవ్‌కు అనుకూలం..

చాలామంది లాంగ్ డ్రైవ్ కోసం థార్‌ను ఎంచుకుంటున్నారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఈ వాహనంలో విహార యాత్రలకు వెళ్లివస్తున్నారు. కూర్చునేందుకు అనువుగా సీట్ల అమరిక ఉండడంతో ఇందులో ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. ధరతోపాటు మెయింటెనెన్స్ ఖర్చు కాస్త ఎక్కువే అయినా థార్‌ను కలిగి ఉండడాన్ని స్టేటస్ సింబల్‌గా భావిస్తుండడంతో జిల్లాలో వాహనాల సంఖ్య పెరిగింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వందకుపైగా థార్‌లు ఉన్నట్లు తెలుస్తోంది.



హుందానిస్తుంది..

థార్‌లో వెళ్తే ఎంతో హుందాగా ఉంటుంది. ఎటైనా ఇదే వాహనంలో వెళ్తున్నా. మట్టి రోడ్లపై ప్రయాణించినా, గుట్టల మీదికి వెళ్లినా సౌకర్యవంతంగా ఉంటుంది. లాంగ్ డ్రైవ్ కోసం కూడా ఉపయోగపడుతుంది.

– సురేందర్‌రెడ్డి, కామారెడ్డి

పార్ట్‌నర్స్‌తో కలిసి..

వ్యాపార భాగస్వాములం కలిసి థార్‌ను కొనుగోలు చేశాం. ఇటీవల ఫ్యామిలీతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చాను. ఫ్యామిలీతో వెళ్లడానికి ఈ వాహనం బాగుంటుంది. ఎంత ఎత్తు ప్రదేశమైనా ఎక్కడానికి ఉపయోగపడుతుంది. – రాజు పాటిల్, దేవునిపల్లి, కామారెడ్డి



ఆకట్టుకునేలా..



థార్ మోడల్ చూడగానే ఆకట్టుకునేలా ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించడానికి ఉపయోగపడుతుంది. స్నేహితులతో కలిసి లాంగ్ డ్రైవ్ చేయడానికి అనుకూలంగా ఉంది. రెగ్యులర్‌గా ఇందులోనే తిరుగుతున్నాం.

– పత్తి శ్రీనివాస్, పిట్లం

సౌకర్యవంతం..



మహీంద్ర థార్ మోడల్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఎలాంటి రోడ్లపైనైనా ఇందులో ప్రయాణించడం సౌకర్యవంతంగా ఉంటుంది. ఫ్యామిలీతో కలిసి ప్రయాణించడానికీ అనువుగా ఉంటుంది.

– అంజద్‌ఖాన్, సీతాయిపల్లి, గాంధారి మండలం

పిల్లలూ ఇష్టపడతారు..



నేను హైదరాబాద్‌లో ఉంటాను. పదిపదిహేను రోజులకు ఒకసా రి స్వగ్రామం బిచ్కుందకు వస్తుంటా. ఇక్కడ వ్యవసాయ పనులు చూసుకుని తిరిగి వెళ్తా. ఫ్యామిలీతో కలిసి వచ్చి వెళ్తుంటాం. ఇందులో ప్రయాణాన్ని పిల్లలూ ఎంజాయ్ చేస్తారు.

– నాలం శ్రీధర్, బిచ్కుంద



తొండాకూర్ వద్ద తెగిపోయిన రోడ్డు

మళ్లీ తెగిపోయిన రోడ్డు..

- నిలిచిన రాకపోకలు

డొంకేశ్వర్ (ఆర్మూర్) : డొంకేశ్వర్ మండలంలోని తొండాకూర్-కుద్వాన్‌పూర్ రోడ్డు మళ్లీ తెగిపోయింది. గత నెలలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బీటీ రోడ్డు ప్రాంతంలో ఇటీవల పైపులు వేసి మట్టితో సరి చేశారు. గ్రామస్తులు చేసిన ప్రయత్నం కొన్ని రోజులు కూడా నిలువకుండా పోయింది. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ఇటీవల నందిపేటకు చెందిన యువకుడు నీటిగుంటలో పడి మరణించాడు. దీంతో మళ్లీ ఎలాంటి ఘటనలు జరగకుండా గ్రామస్తులు శనివారం రోడ్డును మూసివేసి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. తొండాకూర్-కుద్వాన్‌పూర్ గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



రోడ్డును మూసివేసిన గ్రామస్తులు

క్లుప్తంగా

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సౌకర్యం

ఖలీల్‌వాడి : ఉమ్మడి నిజామాబాద్ భక్తుల కోసం అరుణాచలంకు ప్రత్యేక బస్సును ఈనెల 29న మధ్యాహ్నం 1 గంటకు నిజామాబాదు నుంచి బయలుదేరుతుందని ఆర్‌ఎం జానీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న వెళ్లిన బస్సు 30న ఉద యం 3 గంటలకు కాణిపాకం చేరుకొని విఘ్నేశ్వరుని దర్శనానంతరం ఉదయం 8 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అరుణాచలం చేరుకొని, గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 31న ఉదయం 4 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకొని దర్శన అనంతరం సాయంత్రం 4 గంటలకు బయలుదేరి సెప్టెంబర్1న ఉదయం 4 గంటలకు నిజామాబాద్ చేరుకుంటుదన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.4200, పిల్లలకు రూ.3400 ఆసక్తి గల వార డిపోమేనేజర్,నిజామాబాద్–2: 9959226017 7382844366,7382846084, అలాగే సంస్థ వెబ్‌సైట్‌లో రిజర్వ్ చేసుకోవచ్చన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు



ఖలీల్‌వాడి : ప్రస్తుతం ఎక్కువమందికి గుండెపోటు ఆధికంగా వస్తున్నాయని సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కోర్టు బిల్డింగ్‌లో కోర్టు ఉద్యోగులకు సీపీఆర్ శిక్షణ కార్యక్రమంపై నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగహన ఉంటే ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

రెగ్యులరైజ్ లేదా పేస్కేల్

- ప్రభుత్వాన్ని కోరుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు
- జిల్లాలో 328 మంది..
- ఏళ్ల తరబడి తక్కువ జీతాలతో పనిచేస్తున్నామంటూ ఆవేదన



మోర్తాడ్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మోర్తాడ్(బాల్కొండ): కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు తమ ప్రభుత్వం సానుకూలం అని చెబుతున్నా సమగ్ర శిక్ష పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. 2022–23 బడ్జెట్ సమావేశాల్లో సీఎం కే. చంద్రశేఖర్‌రావు, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఎప్రిల్ 2022 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులు అందరు రెగ్యులరైజ్ చేయబడతారని వెల్లడించినట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు గుర్తు చేశారు. ఏళ్ల తరబడి సమగ్ర శిక్షలో చాలీచాలని వేతనాలకు పని చేస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. క్రమబద్ధీకరణకు అవకాశం లేకుంటే గ్రామీణ పేదరికి నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగుల మాదిరిగా పే స్కేల్‌ను వర్తింప చేయాలని వారు విన్నవిస్తున్నారు.

సమగ్ర శిక్ష పథకం కింద విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విశిష్టమైన సేవలందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడంలో తమది కీలక పాత్ర అని ప్రభుత్వం గుర్తించాలని వారు కోరుతున్నారు. గతంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని గుర్తు చేశారు. ఆచరణలో మాత్రం ప్రభుత్వం పట్టించుకోక పోవడం పట్ల ఉద్యోగులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. క్రమబద్ధీకరణ చేయాలని లేదంటే పేస్కేల్ వర్తింప చేయాలని కోరుతు సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే సమ్మె చేపట్టాలని జేఏసీ నాయకులు యోచిస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వివరాలు..

క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు	92
పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు	112
ఐఈఆర్‌పీలు	38
కంప్యూటర్ ఆపరేటర్లు	19
కేర్‌టేకర్లు	19
ఎంఐఎస్‌లు	19
మెస్సెంజర్లు	19
డీపీవో ఉద్యోగులు	10
మొత్తం	328

ప్రభుత్వం గుర్తించాలి



ప్రభుత్వం మాసేవలను గుర్తించాలి. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు విద్యా సేవలు అందిస్తూ మేము ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని భావిస్తున్నాం. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఆందోళన తప్పదు. – రవి కిరణ్, అధ్యక్షుడు, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ

ఒత్తిడిని ఎదుర్కొంటున్నాం



సమగ్ర శిక్ష పథకం కింద పని చేస్తున్న అందరు ఉద్యోగులు ఎంతో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలి. అవకాశం లేకపోతే కనీసం పే స్కేల్‌ను వర్తింప చేస్తే ఉద్యోగులకు ఊరట కలుగుతుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. – దప్పు దిలీప్, ప్రధాన కార్యదర్శి, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ

వడ్లను మాయం చేసింది బోధన్ ఎమ్మెల్యేనే..

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి : రైస్‌మిల్లు నుంచి వడ్లను మాయం చేసిన వ్యక్తి ఎమ్మెల్యే షకీల్ మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్‌లు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీపై చేసిన వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మాజీ మంత్రిసుదర్శన్ రెడ్డి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి చేసిన అభివృద్ధిని బోధన్ ప్రజలు మరిచిపోలేరని, 9ఏళ్లుగా బోధన్ ఎమ్మెల్యే ఏం చేశారో చెప్పాలన్నారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అలీసాగర్ ఎత్తిపోతల పథకంను తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే షకీల్ చేస్తున్న దోపిడీకి ఎమ్మెల్సీ కవిత సాయం చేస్తున్నారన్నారు. బోధన్‌లో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే షకీల్ ఎప్పుడో సమయం చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంలో ముద్దాయిగా ఉన్నట్టు రాహుల్‌గాంధీ ఎలాంటి స్కామ్‌లో లేరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిని కక్కిస్తామన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బీన్‌హందాన్, పీసీసీ డిలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరికొండ గంగారెడ్డి పాల్గొన్నారు.

బట్వాడా చేయని ఉత్తరాలు స్వాధీనం

- పోస్టుమన్‌పై శాఖాపరమైన చర్యలు
- ఉత్తరాలు సోమవారం నుంచి బట్వాడా



ఉత్తరాలను బస్తాల్లో తరలిస్తున్న సిబ్బంది

కామారెడ్డి అర్బన్ : ఉత్తరాలు బట్వాడా చేయని కామారెడ్డి హెడ్‌పోస్టాఫీసు పోస్టుమన్ జీ సీతారామారావుపై బాధితులు ఫిర్యాదు చేయడం, పత్రికల్లో రావడంతో పోస్టల్ ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సురేఖ, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వేణు పోస్ట్‌మన్ సీతారామారావు అడ్రస్ కనిపెట్టారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ, వీధి నం.5లో ఉంటున్న గదికి అధికారులు చేరుకుని దాదాపు వెయ్యికి పైగా బట్వాడా చేయని ఉత్తరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ స మయంలో సీతారామారావు ఇంట్లోనే ఉన్నారు. ఉత్తరాలను ఇతర పోస్టమన్లతో బట్వాడా చేయిస్తామని, సీతారామారావుపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి పోస్ట్‌మాస్టర్ రాజు తెలిపారు.

బీబీసీ పాఠశాలలో విచారణ

- 'సాక్షి' కథనానికి స్పందించి కేసు నమోదు

నిజామాబాద్‌అర్బన్ : నగరంలోని బీబీసీ పాఠశాల చదువుతున్న ఏడో తరగతి విద్యార్థినిని అనుమతి లేకుండా బయటకు తీసుకెళ్లిన ఘటనపై శనివారం డీఈవో ఆదేశాల మేరకు విచారణ జరిగింది. నగరంలోని దారుగల్లీ స్కూల్ హెచ్‌ఎం శంకర్ బీబీసీ స్కూల్‌కు వెళ్లి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. పాఠశాల చైర్మన్ ప్రవీణ్‌ను విచారించారు. విద్యార్థిని బయటకు ఎందుకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఫీజుల వేధింపుల విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన రిపోర్ట్ సిద్ధం చేసుకుంటున్నారు. పాఠశాల దగ్గర్లోని సీసీ పుటేజీలను కూడా పరిశీలించారు. విద్యార్థిని బయటకు తీసుకెళ్లిన దృశ్యాలను రిపోర్ట్‌లో నమోదు చేసుకున్నారు. అనంతరం బాధిత విద్యార్థినిని బీబీసీ స్కూల్‌కు రమ్మనగా వారు పాఠశాలకు తాము రాలేమని ఎంఈవో ఆఫీస్‌కే వస్తామని పేర్కొన్నారు. సోమవారం ఎంఈవో కార్యాలయానికి రావాలని విచారిస్తామని అధికారి పేర్కొన్నారు. కాగా 5వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎట్టకేలకు బీబీసీ పాఠశాల చైర్మన్ ప్రవీణ్‌పై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా విద్యార్థినిని బయటకు తీసుకెళ్లడం, అనుచితంగా ప్రవర్తించడంతో ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నదని ఆమె తల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దాని ప్రకారం అతనిపై కేసు నమోదు చేశారు. సోమవారం ఈ విషయమై మరింత విచారణ చేపట్టి నివేదిక జిల్లా విద్యాశాఖ అధికారికి పంపనున్నారు. కేసు నమోదులో జాప్యం చేయడంలో వర్ని చౌరస్తా ప్రాంతంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ నాయకుడు సదరు పాఠశాల చైర్మన్‌కు సహకరించినట్లు ఆరోపణలున్నాయి. కేసు నమోదు కాకుండా అడ్డుకున్నట్టు తెలిసింది. కానీ ఎట్టకేలకు పోలీసులు శనివారం మధ్యాహ్నం కేసు నమోదు చేశారు.

17వ తేదీన ఫిర్యాదు ఇస్తే..

నిజామాబాద్ అర్బన్ : బీబీసీ పాఠశాలల చైర్మన్ ప్రవీణ్‌పై కేసు నమోదులో పోలీసులు కావాలనే ఆలస్యం చేసినట్లు ఆరోపణలున్నాయి. బాధితురాలు ఈనెల 17వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయలేదు. బాధితురాలి తల్లి ఫిర్యాదు పక్కనపెట్టి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి సాయం చేసినట్లుగా తెలుస్తోంది. 17న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా 19న మధ్యాహ్నం కేసు నమోదు చేశారు. తేదీ మార్చి కేసు ఎందుకు నమోదు చేశారని బాధితురాలు పోలీసులను ప్రశ్నించగా మీరే మాట్లాడుకుంటామన్నారు కదా అని ఎదురు జవాబు చెబుతున్నారని బాధితులు పేర్కొంటున్నారు. అసలు ఫిర్యాదుపై తేదీనే రాయలేదని పోలీసులు పేర్కొంటున్నారు.. మరి తేదీలేని ఫిర్యాదును మీరెలా తీసుకున్నారని అడగగా మీరు స్టేషన్‌కు వస్తే వివరాలు చెబుతామని సమాధానాన్ని దాటవేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు.

కోర్టు తీర్పులపై అవగాహన



సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లా న్యాయవాదులు

ఖలీల్‌వాడి : తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. వైట్ కాలర్ నేరాలు ఎలక్ట్రిసిటీ చట్టాల గురించి కేసుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహిమోద్దీన్, రాజేష్ గౌడ్, అశోక్ శివరాం నాయక్, డాక్టర్ సమ్మయ్య వివరించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య న్యాయసలహాలు తెలిపి, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులపై అవగహన కల్పించారు. రాష్ట్రంలోనే అత్యధిక కేసులలో శిక్షపడేటట్లు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ రవిరాజ్, కవితారెడ్డి, నంద రమేష్, డాక్టర్ సమ్మయ్య అభినందించారు.

కారు అమ్ముతామని సైబర్ మోసం

- అప్రమత్తతతో తప్పిన ఆర్థిక నష్టం

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : ఫేస్‌బుక్‌లో రూ. 80 వేలకే ఈకో కారు అమ్ముతామని పెట్టిన ఫోటోలకు స్పందించిన ఒకరు ఆ తర్వాత భారీ ఆర్థికనష్టం నుంచి బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. రామారెడ్డి మండలం గిద్ద గ్రామానికి చెందిన కాస్తరి మధుసూదన్ ఫేస్‌బుక్‌లో ఈకో కారు రూ. 80వేలకే అమ్ముతామని పేర్కొంటు నంబర్లతో కూడిన ప్రకటన చూసి స్పందించారు. ఈనెల 12న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కారును రూ.80వేలకే అమ్ముతామని ముందుస్తుగా బుక్ చేసుకోవాలనుకుంటే రూ. 3వేలు 84865 10272నంబర్‌కు ఫోన్‌పే పంపాలని పేర్కొనగా మధుసూదన్ రూ. 3 వేలు పంపారు. మరోమారు ఈనెల 13న మరోవ్యక్తి ఫోన్‌చేసి మీ కారు కార్గోలో పంపుతున్నామని రూ. 11,500 పంపాలని పేర్కొనడంతో మధుసూదన్ తాను మోసపోయానని గుర్తించి వెంటనే 1930కు ఫోన్ చేసి సైబర్‌మోసంపై ఫిర్యాదు చేశారు. వారు వెంటనే సదరు నంబర్‌కు వెళ్లిన రూ. 3వేలను హోల్డ్‌లో పెట్టారు. దీనిపై మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



విష్ణువర్ధన్ (ఫైల్)

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన ఎమ్మాజి విష్ణువర్ధన్ (32) శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తో పాటు మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణువర్ధన్ గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్నాడు. శుక్రవారం తండ్రి ఎమ్మాజి గంగాధర్ (బీడీ టేకేదార్)తో కలిసి విష్ణువర్ధన్ నిజామాబాద్‌లోని బీడీ కంపెనీకి వెళ్లాడు. అనంతరం తండ్రిని గ్రామానికి పంపించేసి తాను కులాస్‌పూర్‌కు వెళ్లివస్తానని చెప్పాడు. రాత్రి 10.30 గంటలకు తాను ఇంటికి వస్తున్నట్లు తండ్రికి ఫోన్‌లో తెలిపాడు. కాని ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అయితే ముల్లంగి (ఐ) గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయాన్నే ముల్లంగి(ఐ) గ్రామంలోని ఓ ఇంటి ఎదుట మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు బైక్‌నంబర్ ఆధారంగా పాఠశాల యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన మృతుడి కుటుంబీకులకు తెలుపడంతో హుటాహుటిన వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఐదేళ్ల కుమారుడున్నాడు. గ్రామంలోని సీసీపుటేజీలో ప్రమాద దృశ్యాలు నమోదయ్యాయి.

చేపల వేటకు వెళ్లి యువకుడు..



భాస్కర్(ఫైల్)

బాన్సువాడ రూరల్ : మండలంలోని జక్కల్‌దాని తండా చెందిన ముడావత్ భాస్కర్(28) అనే యువకుడు బోర్లం తోర చెరువులో చేపల వేటకు వెళ్లి నీటమునిగి మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. జక్కల్‌దాని తండాకు చెందిన భాస్కర్ మద్యానికి బానిసై పనిపాట లేకుండా తిరిగేవాడని, కొంత కాలంగా భార్య అనుష, పిల్లలతో కలిసి ఉపాధికోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారన్నారు. ఈనెల 16న తండ్రి చందర్‌ను చూడటానికి తండాకు వచ్చిన భాస్కర్ రాత్రి అందరు పడుకున్న తర్వాత ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు అందరూ వెతకగా బోర్లం చెరువుపై దుస్తులు పడి ఉండడాన్ని గమనించి విచారించగా మృతదేహం లభించిందని, అది భాస్కర్‌దిగా కుటుంబీకులు గుర్తించారన్నారు. చేపల వేటకోసం వెళ్లి నీటిలో మునిగి చనిపోయినట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటిస్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి : నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్‌కాలనీలో ఇంటిస్థలాన్ని ఆక్రమించుకున్నారని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సత్యనారాయణ ఇంటి స్థలం పక్కనే ఉన్న కమలమ్మతోపాటు కుమారులు, మరికొందరు తన ప్లాట్‌లోకి అక్రమంగా ప్రవేశించి గదిని కూల్చివేసి నాగప్రతిమను పెట్టినట్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కమలమ్మతో పాటు కుమారులను ప్రశ్నించగా వారు దాడిచేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు..



దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో రెండు గొర్రెలు, మేక మృతి చెందినట్లు గొర్రెల యజమాని స్వామి తెలిపారు. శనివారం మధ్యాహ్నం వర్షం తగ్గగానే గ్రామ శివారులో మేతకు వెళ్లగా సెల్ ఫోన్ టవర్ వద్ద రెండు గొర్రెలు, మేక విద్యుత్ షాక్‌కు గురై మరణించాయన్నారు. వాటి విలువ సుమారు రూ. 40 వేల వరకు ఉంటుందన్నారు. అధికారులు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

వైన్‌షాప్‌లో చోరీ



భిక్కనూరు : మండల కేంద్రంలోని ఒక వైన్స్ షాప్ షట్టర్‌ను పైకిలేపి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 10 మద్యం సీసాలను శనివారం వేకువజామున అపహరించుకునివెళ్లారు. మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర వైన్స్ షాపు తాళం కప్పలను తొలగించి దొంగలు షట్టర్‌ను పైకి లేపి లోనికి చొరబడ్డారు. క్యాష్ కౌంటర్ ఉన్న రూ. 5వేల నగదు అపహరించుకుని వెళ్లారు. షాప్ నిర్వాహకుడు మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని బొగ్గగుడిసె చౌరస్తా వద్ద పేకాట ఆడుతున్న స్థావరంపై శనివారం సాయంత్రం స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేశారు. బొగ్గగుడిసె చౌరస్తాలోని మడిగెలో పేకాట ఆడుతున్న గ్రామాలకు చెందిన 10 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 15 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ రూరల్ సీఐ మురళి తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిపైన కేసు నమోదు చేసి రిమాండ్ చేశామన్నారు.

డిచ్‌పల్లి ఆర్‌ఎస్‌ఈటీఐకు గ్రేడింగ్



సర్టిఫికెట్ అందిస్తున్న అభినవ్‌కుమార్

డిచ్‌పల్లి : నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఉన్న ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) 2022–23కు గాను 'ఏఏ' గ్రేడ్ సాధించింది. శనివారం మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎంఓఆర్‌డీ) గ్రేడింగ్ ఆఫీసర్ అభినవ్ కుమార్, ఎల్‌హెచ్‌వో ఏజీఎం (ఎస్‌బీఐ, హైదరాబాద్) శ్రీనివాస్‌రావు, ఎల్‌డీఎం (నిజామాబాద్) సందర్శించారు. ఈ సందర్భంగా అభినవ్‌కుమార్ ఆయన మాట్లాడుతు శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణను గుర్తించి గ్రేడింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సంస్థ డైరక్టర్ సుంకం శ్రీనివాస్‌కు గ్రేడింగ్ సర్టిఫికెట్ అందజేశారు. సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్, నవీన్, లక్ష్మణ్, ధర్మపురి,నాగలక్ష్మి, ప్రణీత పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



మాట్లాడుతున్న ఏర్గట్ల ఎస్సై మశ్చేందర్ రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ) : ఏర్గట్ల మండలం తొర్తిలో గంజాయి విక్రయించడానికి వచ్చిన కోరుట్లకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఒకే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు గంజాయిని తీసుకొచ్చి విక్రయించే ప్రయత్నంలో కాపు కాసి పట్టుకున్నామన్నారు. విక్రేతల నుంచి ఒక బైక్‌తో పాటు 160 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్ర శివారులో జాతీయ రహదారి 44 పై ఆగి ఉన్న డీసీఎం వ్యానును లారీ ఢీకొట్టింది. శనివారం ఉదయం 4 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. బొప్పాయికాయల లోడ్‌తో ఆర్మూర్‌నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ మండల కేంద్ర శివారుకు రాగానే టైర్ పంక్చర్ కావడంతో రహదారిపై నిలిపిఉంచారు. అదే మార్గం నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి డీసీఎం వ్యానును బలంగా ఢీకొట్టింది. దీంతో డీసీఎం వ్యాను బోల్తాపడింది. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. లారీ డ్రైవర్ రాంసింగ్‌కు కాలు వి రిగింది. బాల్కొండ పోలీసులు వెంటనే డీసీఎం వ్యాన్‌ను, లారీని రహదారిపై నుంచి తొలిగించారు.

గతేదాది ఇక్కడే..

గతేడాది జూలై మాసంలో శనివారం ఎక్కడైతే ప్రమాదం జరిగిందో అక్కడే ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదం కూడా ఆర్మూర్‌నుంచి వస్తున్న లారీ టైర్ పంక్చర్ కావడంతో లారీని రోడ్డుపై నిలిపిఉంచగా ఆర్మూర్ వైపు నుంచి వస్తున్న కంటెయినర్ ఢీకొట్టింది. ఆ సమయంలో టైర్ మార్చుతున్న కంటెయినర్ డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందారు.

మృతదేహం నుంచి పర్సు, ఏటీఎం కార్డుల చోరీ

ఖలీల్‌వాడి : నగరంలోని 1వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో మోహన్ అనే వ్యక్తి మృతిచెందగా అతడి వద్ద ఉన్న పర్సు, ఏటీఎం కార్డు, భూమి పత్రాలు చోరీ జరిగినట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్రానికి చెందిన మోహన్ గుండెపోటు రావడంతో అతన్ని నగరంలోని మనోరమ ఆస్పత్రికి తీసుకొచ్చారని, వైద్యులు పరిశీలించి అప్పటికే ఆయన మరణించినట్లు పేర్కొన్నారన్నారు. అయితే ఆస్పత్రికి వచ్చిన తర్వాత మోహన్ జేబులో ఉన్న పర్సు, ఏటీఎం కార్డులు, భూమి పత్రాలను ఎవరో చోరీ చేసినట్లు ఆయన కుమారుడు దీపక్ ఫిర్యాదు చేశారన్నారు. జులై 25న ఏటీఎం కార్డు నుండి రూ. 31 వేలు డ్రా చేసినట్లు చెప్పారు. దీపక్ ఫిర్యాదు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.